క్లుప్తంగా

కవి కొప్పుల ప్రసాద్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కొప్పుల ప్రసాద్

నంద్యాల(అర్బన్): తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అక్షర కౌముది సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని శివానంద ఆశ్రమంలో ఆదివారం జరిగిన కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన కవి కొప్పుల ప్రసాద్‌కు ఉగాది పురస్కారం లభించింది. ఆయన మాట్లాడుతూ కవిసమ్మేళనంలో బాంధవ్యాల యుద్ధంలో స్త్రీ స్వరూపం అనే కవితా గానం చేసినందుకు జ్ఞాపిక, శాలువా, ప్రశంసా పత్రాలతో ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, రావూరి వనజ అందజేశారని చెప్పారు.

మనసు పెట్టి పనిచేస్తేనే మనుగడ



మేడం సీ నవలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నంద్యాల(వ్యవసాయం): ఏ రంగంలోనైనా మనస్సుపెట్టి పని చేస్తేనే మనుగడ ఉంటుందని కాశీపురం మేడం సీ నవల అదే కోవకు చెందినదని ప్రముఖ రచయిత కవి శివారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ అభ్యుదయ రచయిత, సీనియర్ జర్నలిస్టు, కాశీపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం సీ నవలను సినీ దర్శకుడు నీలకంఠం ఆవిష్కరించారు. రాయలసీమ అధ్యయన వేదిక కమిటీ కన్వీనర్, ప్రముఖ రచయిత భూమన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శివారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ఫ్యాక్షన్‌పై సమగ్ర నవల రావాలని, ఆయన రెండో రచన అదే కావాలని కోరారు. ప్రముఖ కవి తాడి ప్రకాష్, మాజీ క్రికెటర్ బీసీసీఐ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్, నందిగం శివప్రసాద్, లక్కా భాస్కరరెడ్డి, కుప్పిలి పద్మ, వేల్పూరి సుజాత పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



జిల్లా మిల్లీ కౌన్సిల్ నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తీ ఖదీర్ మౌలానా

నంద్యాల(అర్బన్): యువత పెడధోరణి పట్టకుండా సన్మార్గంలో నడవాలని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తీ ఖదీర్ మౌలానా పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ కార్యాలయాన్ని ఆదివారం ఆవాజ్ కమిటీ నాయకులు ఎంఏ గఫూర్, పారిశ్రామికవేత్త వాహిద్ హుసేన్‌లతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. బెంగళూరుకు చెందిన ఫల్కని యూనివర్సిటీ, ఆలిండియా మిల్లీ కౌన్సిల్ సంయక్తంగా ఉచిత ఉన్నత విద్యను అందించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహిస్తామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ కార్యదర్శి గౌస్, సహాయ కార్యదర్శి ఉస్మాన్‌బాషా, పొలిటికల్ కార్యదర్శి మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని విడనాడొద్దు



ప్రవచనాలను వినిపిస్తున్న ప్రవచనకర్త గరికపాటి గురజాడ

శిరివెళ్ల: హిందూ ధర్మాన్ని వీడనాడొద్దని ఆధ్యాత్మిక సామాజిక ప్రవచనకర్త గరికపాటి గురజాడ తెలిపారు. ఆదివారం గోవిందపల్లెలో విశ్వహిందూ పరిషత్ శిరివెళ్ల ప్రఖండ వైవీ రామయ్య ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు ఆలయాల రక్షణకు ఆలయాలను దర్శించాలని సూచించారు. బాల్యం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు ధర్మం,నీతి, సత్యంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. రామాయణ, మహాభారత సారాంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. రాష్ట్ర సంఘటనా మంత్రి శ్రీనివాసారెడ్డి, గ్రామ పెద్దలు ఇందూరి ప్రతాపరెడ్డి, శేషారెడ్డి, నడిపి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నంద్యాల(అర్బన్): నవనంది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన గుండె, ఊపిరితిత్తుల ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, అసిస్టెంట్ గవర్నర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ శిబిరంలో 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, టు డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు, మందులు అందజేశామని చెప్పారు. వైద్యులు నరేష్‌కుమార్, మాధవరావు, శ్రీనివాసకోటి, లీలాకృష్ణ, సభ్యులు చెంచయ్య, రామశేషు, కృష్ణమూర్తి, రాజేంద్ర, కుమారస్వామి పాల్గొన్నారు.

తపాలా శాఖ వినూత్న పథకం

- రూ.399కే రూ.10లక్షల బీమా
- 18 - 65ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులు
- ఖాతాదారులకు మాత్రమే అవకాశం
- పాలసీ పొందిన రోజు రాత్రి 12గంటల నుంచే వర్తింపు



ఖాతాదారుల కోసం తపాలా శాఖ నూతన బీమా పాలసీని అమలు చేస్తోంది. ఏడాదికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తోంది. ప్రీమియం చెల్లించనప్పటి నుంచి ఏడాదిలోపు ప్రమాదంలో మరణం సంభవించినా, శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం కలిగినా, పక్షవాతం సంభవించినా బీమా అందజేస్తుంది. అలాగే అర్హులైన వారికి ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు రూ.30వేల వరకు చెల్లిస్తుంది. ఇందుకు 18–65ఏళ్ల ఖాతాదారులు మాత్రమే అర్హులుగా పేర్కొంది.

నంద్యాల: తపాలా శాఖ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.399కే అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీ ద్వారా ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.10 లక్షల బీమా కవరేజ్ వర్తిస్తుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65ఏళ్ల మధ్య వయస్సు గల వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గత ఏడాది ఏప్రిల్ నెలలో ప్రవేశపెట్టింది. ఇప్పటికే నంద్యాల జిల్లాలో 2,300 మంది పాలసీని తీసుకున్నారు.

బీమా పాలసీ పొందాలంటే..

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీకి రూ.399 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి బీమా వర్తించదు. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా, పక్షవాతం వచ్చినా బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12గంటల నుంచే బీమా రక్షణ ప్రారంభమవుతుంది. పాలసీ దాదారులకు బాండ్‌ను అందజేస్తారు.

పాలసీ వర్తించే విధానం ఇలా..

- యాక్సిడెంటల్ డెత్ (ప్రమాదవశాత్తు మృతి చెందినట్లయితే)కు రూ.10లక్షల బీమా వర్తిస్తుంది.
- శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10లక్షలు
- పాక్షిక వైకల్యానికి రూ.10లక్షలు
- పక్షవాతం సంభవిస్తే రూ.10లక్షలు
- వైద్య ఖర్చులకు (ఐపీడీ) రూ.30వేల వరకు లేదా వాస్తవ క్లెయిమ్ ఏది తక్కువ అయితే అది వర్తిస్తుంది.
- విద్యాప్రయోజనం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరి పిల్లలకు) 10శాతం, రూ.లక్ష, అసలు ఖర్చులు ఏది తక్కువ ఉంటే అది వర్తిస్తుంది.
- ఆసుపత్రిలో 10రోజుల వరకు ఉంటే రోజుకు రూ.వెయ్యి చొప్పున అందుతుంది.
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25వేలు, అంత్యక్రియలకు రూ.5వేలు
- యాక్సిడెంటల్ మెడికల్ ఖర్చులు ఇన్ పేషంట్లకు రూ.60వేల వరకు అందజేస్తుంది.
- ప్రమాద వశాత్తు వైద్య ఖర్చులు ఔట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్‌కు రూ.30వేల వరకు అందిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ బీమా పొందేలా ఈ పాలసీని తపాలా శాఖ రూపొందించింది. రూ.399 పోస్టల్ ఖాతాదారులు ఏడాదికి చెల్లిస్తే రూ.10లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు 2300 పాలసీలు తీసుకున్నారు. చాలా మందికి ఈ పథకంపై అవగాహన లేకపోవడంతో ప్రజల్లో ఈ పాలసీపై అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాసరావు, పోస్టల్ సూపరింటెండెంట్, నంద్యాల

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అక్కంపల్లె, ఇంజేడు, కొండుపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

నంద్యాల: రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక వ్యవస్థను బలోపేతంచేసస్తూ యువకులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజునాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్టణంలో రెండు రోజుల పాటు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి రూ.13.41లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం ఎప్పుడు జరగలేదన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు సీఎం జగనన్న ఎంతో శ్రమించారన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సమావేశంలో సమాఖ్య నాయకులు రవి నాయక్,మల్లేష్‌నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమ్మ జాతర



మందలూరులో పూజలందుకున్న పెద్దమ్మ



పూజలు చేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: మండలంలోని మందలూరులో గ్రామస్తులంతా ఏకమై చేపట్టిన పెద్దమ్మ జాతర ముగిసింది. 26ఏళ్ల క్రితం గ్రామంలో జాతర నిర్వహించారు. నాటి నుంచి ఎవరూ ముందుకు రాకపోవడంతో జాతర చేయలేక పోయామని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ ఏడాది ఉమ్మడిగా జాతర జరిపించామని, ఇందులో భాగంగా నిపుణులు ప్రత్యేకంగా తయారు చేసిన అమ్మవారి ప్రతిమను ఆదివారం తెల్లవారుజామున పీఠంపై కొలువుదీర్చారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు గ్రామ ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు అమ్మవారికి విశేష పూజలు గావించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జెల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, గంగుల విజయసింహారెడ్డి తదితరులు గ్రామానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రహరీ నిర్మాణం పూర్తి

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో అత్యధికంగా ముస్లిం మైనారిటీలు ఉన్నారు. వారికి సంబంధించిన శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశాన వాటికకు నిధులు మంజూరు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను అభ్యర్థించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.5 లక్షలు మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేశారు. ప్రహరీ నిర్మాణ పనులు 80 శాతం మేరకు పూర్తయినట్లు పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిషత్ నిధుల నుంచి శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం శుభపరిణామమని మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్ చెప్పారు. పనులు పూర్తి చేయించిన ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపా.



ఉయ్యాలవాడలో ముస్లింల శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించిన దృశ్యం

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 6వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకుడు, ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురుజీ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టౌన్ హాల్ పక్కనున్న మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో రోజూ నాలుగు బ్యాచ్‌లు నిర్వహిస్తామని, ఇందులో వివిధ ఆసనాలను సాధన చేయిస్తామని చెప్పారు. దీర్ఘకాలిక జబ్బులకు సంబంధించినటువంటి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

కడపకు వెళ్లి పింఛన్ అందజేత



పెద్దబాషుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహబూబ్‌బీ

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన కట్టుబడి పెద్దబాషు అనే వృద్ధుడు అనారోగ్యంతో వైఎస్సార్ జిల్లా కేంద్రలోని రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మహబూబ్‌బీ, గృహసారథి జమాల్‌బాషా అక్కడి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. వైద్యఖర్చులకు ఎంతో ఇబ్బంది పడుతున్న తనకు సరైన సమయంలో పింఛన్ అందజేయడం సంతోషాన్నిచ్చిందని లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపాడు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 15వ వార్డు కౌన్సిలర్ సన్నల అనూష, వార్డు ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డి కోరారు. వార్డులోని గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయులను ఆదివారం కలిసి మద్దతు కోరారు.

23 గంటల్లో నీటి సమస్య పరిష్కారం



పైప్‌లైన్ లీకేజీ అరికట్టే పనులు చేస్తున్న సిబ్బంది

నంద్యాల(సిటీ): పట్టణంలోని 35వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ లీకై కలుషిత నీరు వస్తుందంటూ స్థానికుల ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కలుషిత నీరు వస్తుండటానికి ప్రధాన కారణం పైప్‌లైన్ లీకేజీ అని గ్రహించారు. దీంతో ఫిర్యాదు అందిన 23 గంటల్లోపే వాటర్ వర్క్స్ అధికారులతో లీకేజీని పరిష్కరించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కాలనీకి నీటి సరఫరా చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా జర్నలిస్టు కాలనీ సమీపంలో రహదారి పక్కన చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందనే స్థానికుల ఫిర్యాదు మేరకు చెత్తను తొలగింపజేయించారు.

దేవతలారా దిగిరండి

- రామతీర్థంలో బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- ఉదయం కలశస్థాపన
- రాత్రి వైభవంగా చక్ర పెరుమాళ్ల ఉత్సవం



కలశస్థాపన చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రామతీర్థ పరశురామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం కలశస్థాపన, ధ్వజారోహణంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని అర్చకులు వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులు శ్రీ యోగనంద నరసింహస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంరించి పూల పల్లకీలో ఆశీనులుగావించి మాడవీధుల్లో పెరుమాళ్ల ఉత్సవం జరిపించారు.

కౌలురైతు ఆత్మహత్య



దావీదు (ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొమెర దావీదు (35) అనే కౌలు రైతు శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తిరుపాల్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా.. దావీదు ఐదేళ్లుగా నాగుల ఎకరాలు కౌలుకు తీసుకొని సీడు పత్తి సాగు చేస్తున్నాడు. పెట్టుబడులు, పొలం కౌలు కోసం రైతుల వద్ద సుమారు రూ.13 లక్షలు అప్పు చేశాడు. సాగు కలిసి రాకపోవడంతో అప్పు తీర్చలేననే బెంగతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన భార్య ఇరుగుపొరుగు వారి సహకారంతో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సుజానమ్మ, అలెక్స్, అలేఖ్య అనే ఇద్దరు సంతానం.కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సర్పంచులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులను కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోనున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ మధుసూదన్‌రావు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిని నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్‌రోల్ చేసుకున్న ప్రతి ఓటరు మొదటి ప్రాధన్యత ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్‌పై మొదటి ప్రాధాన్యత ఎలా ఇవ్వాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నరసింహారెడ్డి, విజయా డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేడుకను తిలకిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కల్యాణంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

అహోబిలం.. భక్తజన సంద్రం

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దిగువ అహోబిలంలో జరిగిన వేడుకను తిలకించేందుకు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరయ్యారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని తిలకించారు. కాగా స్వామి అమ్మవార్ల కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలను అందజేసింది.



టీటీడీ తరఫున పట్టువస్త్రాలను తీసుకొస్తున్న దృశ్యం

వేడుకగా పదహారు రోజుల పండుగ

మహానంది: క్షేత్రంలో ఆదివారం పదహారు రోజుల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు చేపట్టారు. ముందుగా శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామివార్లకు మహారుద్రాభిషేకం, కుంకుమార్చన పూజల అనంతరం యాగశాల నుంచి అంకురాలను చండీశ్వరస్వామితో కలిసి తీసుకెళ్లి రుద్రగుండం కోనేరులో విసర్జన చేశారు. రథం వద్ద వివాహదీక్ష, దేవతలకు విశేష పూజలు చేశారు.

కుక్కకు పుట్టినరోజు వేడుకలు



పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని ఉప్పరి పేటకు చెందిన డాక్టర్ అపర్ణ కుటుంబ సభ్యులు తమ పెంపుడు కుక్కకు ఆదివారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పగ్ జాతికి చెందిన శునకాన్ని పెంచుకుంటున్నారు. స్నూపీగా పేరుతో పిలుచుకుంటున్న ఆ కుక్క బర్త్‌డేను బంధుమిత్రులను మిలిచి కేక్ కట్ చేశారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న పోలీసు కుటుంబ సభ్యులు

నంద్యాల(అర్బన్): నంద్యాల పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలకు ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ విజయరాణి సెంట్రల్ కుమార్ అధ్యక్షతన మెంబర్ కల్యాణి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని 300 మంది మహిళా కానిస్టేబుళ్లు, పోలీసు కుటుంబ సభ్యులకు శాంతిరాం ఆసుపత్రి వైద్యులు ఉచిత మెడికల్ పరీక్షలు నిర్వహించారు. కల్యాణి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో 1908లో కార్మిక ఉద్యమం ప్రారంభమైందని, ఆ ఉద్యమంలో దాదాపు 15వేల మంది మహిళలు పాల్గొన్నారని గుర్తు చేశారు. 1909లో సోషలిస్టు పార్టీ ఆఫ్ అమెరికా, మహిళా దినోత్సవాన్ని జరుపుకోవచ్చని ప్రకటించిందన్నారు. హక్కుల గురించి మహిళలకు అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. వైద్యులు హర్షిత, లిఖిత, ఆరిఫాబాను పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



సంఘీభావం తెలుపుతున్న వీఆర్‌ఏలు

నంద్యాల(అర్బన్): ఐకమత్యంతోనే విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీ వీఆర్‌ఏల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ధైర్యం తెలిపారు. స్థానిక ప్రథమనందీశ్వర దేవస్థానంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం నంద్యాల జిల్లా వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి సత్యరాజు అధ్యక్షతన ఎన్నిక జరిపించారు. నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా నారాయణ, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధైర్యం మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ఇంటర్ అర్హతతో వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించాలని, వృద్ధాప్యంలో ఉన్న వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులను నామినీగా నియమించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ వీఆర్‌ఏల కుటుంబాలకు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాహనాల వేలం

వెలుగోడు: ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో వివిధ మద్యం కేసులలో పట్టుబడిన సుమారు 26 వాహనాలు (2 కార్లు, 05 ఆటోలు, 01 బొలెరో, 18 బైక్)లకు వేలం పాట నిర్వహించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వేలంలో సుమారు వంద మంది పాల్గొన్నారన్నారు. వేలంలో ప్రభుత్వానికి రూ.6,78,300 ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు, నందికొట్కూరు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నంద్యాల శాఖా గ్రంథాలయం పేరు మార్పు



పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంగా మారిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతినగర్‌లోని నంద్యాల శాఖా గ్రంథాలయానికి పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంగా నామకరం చేశారు. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అష్టదిగ్గజాల్లో ఒక్కరైన మహాకవి పింగళి సూరన పేరును గ్రంథాయాలనికి పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన సూరన సార్వత సంఘం గత ఏడాది నంద్యాల శాఖా గ్రంథాలయానికి పింగళి సూరన పేరు పెట్టాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ద్వారా రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖను కోరారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ పేరు మార్పు ఉత్తర్వులను గత ఏడాది విడుదల చేసిందని, ప్రస్తుతం ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీధర్ గ్రంథాలయ ప్రాంగణానికి నూతన నామఫలకం ఏర్పాటు చేశారు. పేరు మార్చడంలో కృషి చేసిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డికి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు గెలివి సహదేవుడు, మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ దీవీ హయగ్రీవాచారి, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.